క్లుప్తంగా

నేడు కార్పొరేషన్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలు ప్రారంభిస్తున్న వెంకటరత్నం

తిరుపతి కల్చరల్ : క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం తెలిపారు. రాస్‌లో మహిళా పొదుపు సంఘాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆదివారం ఎస్వీ యూనివర్సిటీ గ్రౌండ్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. జెండా ఊపి పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బందిలో ఉత్సాహం పెంపొందించేందుకే క్రీడాపోటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాస్ సంయుక్త కార్యదర్శి మమత మాట్లాడుతూ విజేతలకు ఈనెల 31వ తేదీన బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాస్ డైరెక్టర్ నాగరాజు, అధికారులు బాలాజీరెడ్డి, రవి, వెంకటేష్, తపోవని, భార్గవి, వనజ పాల్గొన్నారు.

'పడమటి గాలి'కి పిలుపు



మిట్టూరులో రైతులకు కరపత్రాలు అందిస్తున్న సమితి నేతలు

తిరుపతి కల్చరల్ : మహతి కళాక్షేత్రంలో ఈనెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించే పడమటి గాలి నాటకానికి రైతులందరూ తరలిరావాలని తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజు, అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం ఈ మేరకు రామచంద్రాపురం, నెన్నూరు, నడవలూరు, మిట్టూరు, సి.రామాపురం, చిగురువాడ, తనపల్లె, పేరూరు, దుర్గ సముద్రం, పాతకాల్వ గ్రామాలకు వెళ్లి వెయ్యి మంది రైతులకు నాటక కరపత్రాలు అందించారు. వారు మాట్లాడుతూ రైతు కష్టాలను ఆవిష్కరించే అపూర్వమైన నాటకమని, తప్పకుండా వీక్షించాలని కోరారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు నాదెండ్ల శ్రీమన్నారాయణ, మోహన మునిసిద్ధారెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

పెన్షనర్ల దినోత్సవం రేపు



మాట్లాడుతున్న మార్కొండరెడ్డి

తిరుపతి కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నరసింహతీర్థం రోడ్డులోని ఆఫీసర్స్ క్లబ్‌లో జాతీయ పెన్షనర్ల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఆదివారం ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మార్కొండరెడ్డి ,ఆర్‌డీ సుబ్రమణ్యం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కార్యక్రమానికి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ శిరీషతో పాటు ప్రభుత్వ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించనున్నట్లు వివరించారు. సమావేశంలో అసోసియేషన్ సహ అధ్యక్షుడు కె.రామలింగారెడ్డి, కార్యదర్శి ఆర్.శ్రీనివాసులురెడ్డి, టీఎస్ శ్రీధర్, ఎల్.వెంకటరమణ, కనికరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్య సాధనతోనే ఉజ్వల భవిత




మాట్లాడుతున్న సినీ నటుడు ప్రదీప్

తిరుపతి కల్చరల్ : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం నిర్దేశించుకుని, అది సాధిస్తేనే ఉజ్వల భవిత పొందవచ్చని సినీ నటుడు, వ్యక్తి వికాస శిక్షకుడు ప్రదీప్ కొండిపర్తి తెలిపారు. ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో బాలాజీ నర్సింగ్ కళాశాల, వినాయక నర్సింగ్ స్కూల్, ప్రవీణ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎలా సాధించాలో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అతిథులుగా హాజరైన ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గౌరవ కార్యదర్శి రవీంద్రారెడ్డి, క్లాస్ వన్ కాంట్రాక్టర్ ఎం.గిరిజా మోహన్ మాట్లాడుతూ చదువుతో పాటు స్నేహ బంధాలను విశదీకరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్, కరస్పాండెంట్ ఏలియమ్మజాన్, ప్రిన్సిపాళ్లు జెస్సీ గ్రేస్, నవీన్‌కుమార్, ఏ.గీత, పింకి, భార్గవి మోహన్ కృష్ణ, సునీల్‌రెడ్డి, అఖిల్, హారిక పాల్గొన్నారు.

శీతాకాలం.. శ్వాస భద్రం

నగరంలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పడిపోతున్నాయి. చలి తీవ్రత.. పొగమంచు పెరిగిపోతున్నాయి. మారిన వాతావరణ పరిస్థితుల్లో ప్రమాదక వైరస్‌లు పొంచి ఉన్నాయి. శ్వాసకోశ వ్యాధులు..జ్వరపీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. శీతాకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్యవంతులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మంచాన పడాల్సిందే అని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆస్తమా.. గుండె.. మధుమేహ సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు.



- భారీగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు పాటించకుంటే రోగాలు తప్పవు
- గుండె, ఆస్తమా, మధుమేహ వ్యాధిగ్రస్తులు అప్రమత్తం
- పెంపుడు జంతువులకు దూరంగా ఉండడం ఉత్తమం
- పిల్లలు, వృద్ధులపై వైరస్ దాడికి అవకాశం

తిరుపతి సిటీ/తిరుపతి తుడా : శీతాకాలంలో రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి వాతావరణంలో ఎక్కువ సమయం గడపకుండా అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు వేకువజామున, రాత్రివేళల్లో బయట సంచరించకుండా ఉంటే ఉత్తమం. ప్రధానంగా పిల్లలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. ఏమాత్రం అనారోగ్యం తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. సకాలంలో చికిత్స అందించాలి. అలాగే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సైతం మరింత జాగ్రత్తగా ఉండడం మంచిది. ఈ క్రమంలోనే శీతాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.

వ్యాయామం తగ్గించాల్సిందే!

ఉదయం పొగ మంచు, ఈదురుగాలులు విజృంభిస్తుంటాయి. దీంతో శ్వాసకోస వ్యాధిగ్రస్తులు ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. వ్యాయామం చేసే విషయంలో వీరు జాగ్రత్తలు పాటించాలి. వ్యాయామం పేరుతో గంటల కొద్దీ ఓపెన్ ఎయిర్ గ్రౌండ్స్, పార్కులలో తిరగడం తగ్గించాలి. ఇంట్లో, ఇండోర్ స్టేడియంలో మాత్రమే వ్యాయామం చేయడం మంచిది. అరగంట పాటు సురక్షిత ప్రాంతంలో నడక, ఆటలు కొనసాగించాలి.

వ్యాధిగ్రస్తులు తస్మాత్ జాగ్రత్త

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ఊహించని స్థాయిలో పడిపోతున్నాయి. చలితీవ్రత పెరిగే కొద్దీ రక్తనాళాలు సంకోచిస్తాయి. దీంతో అవయవాలకు రక్తప్రసరణ చేసే గుండె మరింత వేగంగా పనిచేయాల్సి ఉంటుంది. ఆక్సిజన్‌తో కూడిన రక్త సరఫరా తగ్గడంతో గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువ. గుండె జబ్బులు, మధుమేహం, ఆస్తమా వ్యాధిగ్రస్తులకు శీతాకాలం శత్రువే. శరీరం వ్యాధుల భారిన పడేది ఈ సీజన్‌లోనే అధికం. ఎప్పుడైనా గుండెలో చిన్న నొప్పిగా అనిపించినా, వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నారుల విషయంలో తల్లి దండ్రులు చాలా జాగ్రత్త వహించాలి. ఉదయం, రాత్రి వేళల్లో పిల్లలను బయటకు రానివ్వకుండా చూసుకోవాలి. వయోవృద్ధులు సైతం జాగ్రత్తలు పాటించకుంటే వైరస్ దాడిచేసే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు తప్పనిసరి



చలికాలం ఆరోగ్యవంతులు సైతం వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువ. గుండె జబ్బులు ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలి. చిన్న తేడా కనిపించినా వైద్యులను సంప్రదించాలి. శీతల పానీయాలు, పదార్థాల జోలికి వెళ్లకూడదు. వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి. వృద్ధులు, చిన్నపిల్లలు మంచులో తిరగకుండా ఉంటే మంచిది. గోరు వెచ్చని నీటినే తాగాలి. ఇంట్లో చేసిన ఆహార పదార్థాలను భుజిస్తే ఆరోగ్యకరం.

– యువ అన్వేష్, హెల్త్ ఆఫీసర్, మున్సిపల్ కార్పొరేషన్, తిరుపతి

పెట్‌లకు దూరం!

శీతాకాలంలో పెంపుడు జంతువులకు దూరంగా ఉండడం ఉత్తమం. వైరస్‌ల వ్యాప్తికి పెంపుడు జంతువులు ప్రధాన కారణమని వైరాలజీ నిపుణులు చెబుతున్నారు. ఈ కాలంలో వాటిని బెడ్‌రూమ్, వంట గదిలోనికి రానివ్వకుండా అదుపు చేయడం మంచిది. పిల్లలు, వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉన్న వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు పెంపుడు జంతువులకు దరిదాపులలోకి కూడా వెళ్లకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

బయటి ఆహారం వద్దు

వాతావరణం చల్లగా ఉంటే చాలు వేడి వేడి పకోడీలు, బజ్జీలు, బోండాలను విపరీతంగా ఆరగిస్తుంటాం. శీతాకాలంలో అలాంటి ఆహార పదార్థాలకు కొన్ని రోజుల పాటు విరామం ఇవ్వాలి. ఇది ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలు, ఆకుకూరలు, ఏ, సీ, కే విటమిన్లు పుష్కలంగా లభించే పదార్థాలనే వాడాలి. బీటా కెరోటిన్, నైట్రస్ వంటివి ఉండే బీట్‌రూట్, క్యారెట్‌లను భుజిస్తుండాలి. మసాలా ఫుడ్‌కు దూరంగా ఉంటే మేలు.

గోరు వెచ్చని నీటితో ఉపశమనం

చల్లదనంతో ఊపిరితిత్తులలోని పొరలు అతిగా స్పందిస్తాయి. కూల్ డ్రింక్‌లు, ఫ్రిజ్‌లో పెట్టిన వాటిని సేవించడం ప్రమాదకరం. జలుబు, దగ్గు, జ్వరం బారిన పడిన వారు గోరు వెచ్చని నీటిని తాగితే కాస్త ఉపశమనంగా ఉంటుంది. అలాగే ధూమపానానికి దూరంగా ఉండడం ఎంతో శ్రేయస్కరం.

'పచ్చ'ముద్రకు విఫలయత్నం



పెయింటింగ్ పనులు అడ్డుకుంటున్న సర్పంచ్

పాకాల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. తమ్ముళ్ల అక్రమాలపై ప్రజల్లో తీవ్ర అసహనం ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడా చైర్మన్ హోదాలో తుడా నిధులతో బెంచీలను ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో ఆదివారం కొందరు టీడీపీ నాయకులు ఆ బెంచీలకు పసుపు రంగు వేయించేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న సర్పంచ్ కస్తూరి వెంటనే అక్కడకు చేరుకుని బెంచీలకు రంగు వేసే పనులను అడ్డుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ తుడా నిధులతో వేసిన బెంచీలకు పసుపు రంగు ఎలా వేస్తారని, ముందస్తుగా ఎలాంటి అనుమతులు, తీర్మానాలు లేకుండా పనులు చేపట్ట కూడదని స్పష్టం చేశారు.

అలరించిన సాంస్కృతికం

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. నెల్లూరుకు చెందిన హారిణి బృందం ప్రదర్శించిన భరతనాట్యం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు హారిణీకృష్ణ, ధరణీకృష్ణ, సంప్రీతిక, స్ఫూర్తి, మోక్ష, వినూత్న, రుష్మితశ్రీ, నయనికలు చూడచక్కని హావభావాలతో చేసిన నాట్య అభినయం రంజింపజేసింది. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలీ సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు.

కేరళపై కేంద్రానికి వివక్ష



మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

తిరుపతి కల్చరల్ : కేరళలో వామపక్షం అధికారంలో ఉండడంతో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిన రాష్ట్రానికి సహకారం అందించకపోవడం దారుణమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మండిపడ్డారు. సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో కేరళకు సంఘీభావ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేరళ ప్రభుత్వానికి నిధులు మంజూరు చేయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళలో వామపక్షం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేదవాడికీ భూమి పంచుతోందని వెల్లడించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లిస్తోందని తెలిపారు. చౌక దుకాణాల ద్వారా పేదలకు 16 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తోందని వివరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ యత్నిస్తున్నాయని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత మాట్లాడుతూ పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న కేరళ ప్రభుత్వంపై బీజేపీ వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కాసల కోనయ్య

చంద్రగిరి : ఆధునిక సమాజంలో పౌర హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవగాహన అవసరమని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం వ్యవస్థాపకుడు, జాతీయ చైర్మన్ కాసల కోనయ్య తెలిపారు. ఆదివారం మహిళా ప్రాంగణంలో నిర్వహించిన మానవ హక్కుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కోనయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మానవ హక్కులపై అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థలు కార్యక్రమాలు నిర్వహించే దిశగా కార్యచరణ రూపొందించామని వెల్లడించారు. సంస్థ జాతీయ డైరెక్టర్ కొండేటి ఆంజనేయులు మాట్లాడుతూ హక్కులపై అవగాహన లేకనే ఎక్కువమంది జీవితంలో వెనకపడ్డారన్నారు. హక్కుల వినియోగంపై కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బీవీ గణేష్, రాయలసీమ రీజనల్ వైస్ చైర్మన్ హేమసుందరం, జిల్లా అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



హాజరైన ఉద్యోగులు



నూతన రాష్ట్ర కమిటీ

- ఏకగ్రీవంగా ఖజానా శాఖ ఉద్యోగుల కమిటీ
- పదోన్నతులు కల్పించాలని సంఘం డిమాండ్

తిరుపతి అర్బన్ : ఖజానా లెక్కల శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర కమిటీ నేతలు డిమాండ్ చేశారు. తిరుపతి–కరకంబాడీ మార్గంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా రాష్ట్ర స్థాయి నూతన కమిటీని ఎంపిక చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా గోవిందు రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా కాజ రాజ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల పదోన్నతికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపిస్తే తాము ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా కె. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కరిముల్లా, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి. శ్రీనివాసరావు, కోశాధికారిగా యుగంధర్‌తో పాటుగా ఏడుగురు ఉపాధ్యక్షులు, ఏడుగురు కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

పటేల్ సేవలు మరువలేం



పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి గాంధీ రోడ్ : దేశ ఐక్యత, సమగ్రాభివృద్ధికి సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలు మరువలేమని బీజేపీ నేత గుండాల గోపీనాథ్ రెడ్డి కొనియాడారు. ఆదివారం పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నేతలు కట్టమంచి చంద్రబాబు యాదవ్, సుబ్రమణ్యం యాదవ్, మల్లారపు రవి ప్రసాద్, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని..

– ముగ్గురికి గాయాలు

తిరుపతి క్రైం: తిరుపతి కరకంబాడి రోడ్డులోని రెండు వాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాల మేరకు.. రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన యశ్వంత్, సాయి బైక్‌లో తిరుపతి నుంచి కరకంబాడికి బయలుదేరారు. కరకంబాడి మధ్య మార్గంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద అదే ప్రాంతానికి చెందిన దేవ, బుడ్డిరెడ్డి ఇద్దరు బైక్‌లో రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో యశ్వంత్ వేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. యశ్వంత్ క్షేమంగా బయటపడగా, సాయికృష్ణ, బుడ్డిరెడ్డికి స్వల్ప గాయాలు కాగా, దేవాకు తీవ్రంగా గాయపడగా, ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అభయాంజనేయుని ఉత్సవ కమిటీ ఎన్నిక



నియామక పత్రం చూపుతున్న మునస్వామి

భాకరాపేట : అభయాంజనేయస్వామి ఆలయ ఉత్సవ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. చిన్నగొట్టిగల్లు మండలం చిన్నగాండ్లపల్లెలోని ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడిగా టీటీడీ మాజీ డిప్యూటీ ఈఓ డాక్టర్ టి.మునస్వామి(మౌని) ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ఎమ్. శ్రీకాంత్‌యుడు, ఎస్.మల్లికార్జున, గౌరవ సలహాదారుడిగా కె. సురేంద్రరావు, కార్యదర్శిగా కె.సురేంద్ర, కోశాధికారిగా కె. చేతన, ఉపాధ్యక్షులుగా జి. పద్మావతమ్మ, బి.లక్ష్మీపతిఆచారి, ఉప కార్యదర్శులుగా డి. వెంకటాచారి, జి. గురునాథం, జె. విశ్వనాథన్, సహ కార్యదర్శులుగా జి.హరినాథ రెడ్డి, కె. మల్లికార్జునాచారి, కె. మోహనాచారి, ఐదుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. మొత్తం ప్రక్రియను జైసీతారామ్ శ్రీభక్త సిద్ధి అభయాంజనేయ సేవాసమాజం (ట్రస్ట్) అధ్యక్షుడు సీఏ రమేష్ పర్యవేక్షించారు.

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములుకు జోహార్లర్పిస్తున్న ఆర్యవైశ్యులు

తిరుపతి కల్చరల్ : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం రుయా ఆస్పత్రి వద్ద ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు పాల్గొన్నారు. అలాగే రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాముల విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో రంగస్థలి ప్రతినిధులు రవి, సుబ్రమణ్యంయాదవ్, విజయ భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, హనుమంతరావు పాల్గొన్నారు.

అజరామరం.. ఘంటసాల గానం



గాయకుడు విల్సన్ హెరాల్డ్‌ను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : తెలుగు పాట ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన ఘంటసాల గానం అజరామరమని పలువురు వక్తలు కొనియాడారు. ఘంటసాల 102 జయంతిని పురస్కరించుకుని టీటీడీ సహకారంతో తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మహతి కళాక్షేత్రంలో మనసు పరిమళించెనే పేరుతో చేపట్టిన సంగీత విభావరి ఆదివారం రాత్రితో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా సినీ నటుడు ప్రదీప్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, శాప్ చైర్మన్ రవినాయుడు, యోధ గ్రూప్ ఆఫ్ కంపెనీల చైర్మన్ యోగేష్, చదలవాడ సుమలత, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ సుమ ముద్దుబాల హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఘంటసాల కంఠస్వరం నుంచి జాలువారిన ప్రతి పాట అన్ని తరాలను ఉర్రూతలూగించే ఆణిముత్యాలన్నారు. అమరగాయకుడి పాటల మాధుర్యం అందించిన తిరుపతి ఫిలిం సొసైటీ నిర్వాహకులు అభినందనీయులని తెలిపారు. ఈ క్రమంలోనే గాయకుడు విల్సన్ హెరాల్డ్(చంద్రతేజ) ఘంటసాల పద్యాలను, పాటలను, భగవద్గీత శ్లోకాలను సుమధురంగా ఆలపించి ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకున్నారు. అలాగే సాయి శశాంక్, సుమనాస్, ప్రశస్తి, రాజు తమదైన శైలిలో ఘంటసాల యుగళ గీతాలను గానం చేసి శ్రోతల హృదయాలను రంజింపజేశారు. అనంతరం గాయనీ గాయకులను అతిథులు, నిర్వాహకులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు, కార్యదర్శి సీఆర్‌కే శేషగిరిరావు, కోశాధికారి యు.ప్రసాద్‌రావు, బుజ్జిబాబు నాయుడు, ప్రతినిధులు ఎస్.సుబ్రమణ్యం, గుల్జార్, అనసూయ, బండి మదుసూధన్‌రెడ్డి, భాస్కర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

అమాత్యా.. ఆలకించరా!




మాట్లాడుతున్న మంత్రి సవిత



ప్రసంగం వింటున్న హాస్టల్ విద్యార్థినులు

తిరుపతి అర్బన్: రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు విద్యార్థులతో పాటు హాస్టల్స్ వార్డెన్లు సమస్యలు ఏకరువు పెట్టారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆమె ఆదివారం అన్నమయ్య సర్కిల్ సమీపంలోని బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనను కొనియాడుతూ ఉపన్యాసం మొదలు పెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు తమ హాస్టల్ భవనం శిథిలమైందని, తాము ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. బిల్లులు అందకపోవడంతో మెనూ ప్రకారం భోజనం వడ్డించడం కష్టంగా ఉందని సమస్యలు ఏకరువు పెట్టారు. జిల్లాలోని బీసీ హాస్టళ్లకు రూ.3 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయని, అంతేకాకుండా అనేక అద్దె హాస్టళ్లకు సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో భవన యజమానులు ఖాళీలు చేయాలని విన్నవించారు. స్పందించిన మంత్రి బడ్జెట్‌లో బీసీ హాస్టల్స్ పెండింగ్ బిల్లులు పెట్టడంతో పాటు మంజూరు చేశారని స్పష్టం చేశారు. అలాగే అన్నమయ్య సర్కిల్ సమీపంలోని హాస్టల్ మరమ్మతులకు రూ.8 లక్షలు మంజూరు చేయిస్తామని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, కృష్ణ యాదవ్, ఎంప్లాయ్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిబాలకుమార్, బీసీ వెల్ఫేర్ అధికారులు చంద్రశేఖర్, జ్యోత్స్న, లక్ష్మీనారాయణ, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

కట్టమీద గంగమ్మకు పూజలు



అలంకరణలో గంగమ్మ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లులోని కట్టమీద గంగమ్మ ఆలయంలో ఆదివారం పొంగళ్లని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ధర్మకర్తలు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, నాగరత్న, సర్పంచ్ సింహాల విమల పాల్గొన్నారు.



శ్రీనివాసమంగాపురం, తిరుచానూరు ఆలయాల్లో దీపోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

వైభవంగా కార్తీక దీపోత్సవం



చంద్రగిరి : తమిళ కార్తీక మాసం సందర్భంగా ఆదివారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర ఆలయంలో వైభవంగా కార్తీక దీపోత్సవం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.